క్లుప్తంగా

న్యాయవాదులు విధుల బహిష్కరణ



సత్తెనపల్లి: బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామానికి చెందిన న్యాయవాది కోట సాంబశివరావు పట్ల అచ్చంపేట ఎస్.ఐ మణికృష్ణ, రైటర్ సత్యరాజ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. సదరు ఎస్ఐ, రైటర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మారూరి లింగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదు పరిశీలన

నకరికల్లు: ఈకేవైసీ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు అన్నారు. నర్సింగపాడు గ్రామంలో ఈ-కేవైసీ నమోదు ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగుచేస్తున్న పంటలకు ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవేసి చేయించుకునేందుకు గడువు మంగళవారంతో ముగుస్తుందని తెలిపారు. మండలంలో 5,225 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేస్తుండగా 75 శాతం మందికి పైగా రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకున్నారని తెలిపారు.

మిర్చి పంట క్షేత్ర పరిశీలన



88త్యాళ్లూరు(క్రోసూరు): రాయల్ సీడ్స్ జయభేరీ మిరప విత్తనం సాగు చేసిన పొలాలను ఆ కంపెనీ ప్రతినిధులు రైతులతో కలిసి క్షేత్రప్రదర్శన చేపట్టారు. జయభేరీ విత్తనం అన్ని రకాల నేలలకు అనుకూలంగా ఉంటూ, చీడ పీడలను, గులాబీ రంగు పురుగును సమర్థంగా తట్టుకుంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. చెట్టుకు 90 నుంచి 100 కాయలు దిగుబడి నిస్తుందని తెలిపారు. ఎకరాకు 15 నుంచి 20 కింటాళ్ల దిగుబడిని ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మిర్చి రైతులు పాల్గొన్నారు. కంపెనీ ప్రతినిధులు కొసనా నాగేశ్వరరావు, ఆర్ ఎంజీ నరసింహారావు, ఎస్వో మహేష్, డిస్ట్రిబ్యూటర్లు కె.కొండలు ఎ.శ్రీనివాసరెడ్డి, కె.సురేష్, ఆర్.శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రంగురాళ్లు ఏరుకునే వారికి కౌన్సెలింగ్



నకరికల్లు: రంగురాళ్ల కోసం అత్యాశకు పోయి ప్రమాదాల బారిన పడవద్దని తహసీల్దార్ కె.నగేష్, ఎస్ఐ ఎ.బాలకృష్ణ సూచించారు. మండలంలోని త్రిపురాపురం కొండ ప్రాంతంలో చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, యువకులు గత కొన్ని రోజులుగా మండుటెండను కూడా లెక్క చేయకుండా రంగురాళ్ల వేటలో పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్, ఎస్ఐలు సోమవారం వారి వద్దకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అత్యాశతో అటవీ, కొండ ప్రాంతాల్లో తిరిగి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని చెప్పారు. అనంతరం వారిని అక్కడి నుంచి పంపించివేశారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి



వినుకొండ(నూజెండ్ల): ఈతకు వెళ్లి యువకుడు మృతిచెందిన సంఘటన నూజెండ్ల మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో జరిగింది. సేకరించిన వివరాల మేరకు... బుర్రిపాలెం గ్రామానికి చెందిన యన్నాబత్తుని ఎర్రయ్య, ఏసమ్మల పెద్దకుమారుడు మనేష్ (21) డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం ఉదయం మనేష్ తన ఇద్దరు మిత్రులతో కలిసి గ్రామ సమీపంలో నూతనంగా తవ్విన బావిలో ఈతకు వెళ్లాడు. మనేష్ ప్రమాదవశాత్తు బావినీటిలో మునిగి మరణించాడు. స్థానికులు గమనించి యువకుడి మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు. మనేష్ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రైతు అదృశ్యంపై ఫిర్యాదు

నాదెండ్ల: మతిస్థిమితం, అనారోగ్యంతో బాధపడుతున్న రైతు 6వ తేదీ నుంచి కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంకురాత్రిపాడు గ్రామానికి చెందిన రైతు బత్తుల ఐతంరాజు వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. సుమారు ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల మతిస్థిమితం కోల్పోయాడు. కుటుంబ సభ్యులు వైద్యుని సలహా మేరకు చికిత్స చేయిస్తున్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో గ్రామంలోని బస్టాప్ వద్ద నుంచి నరసరావుపేట వెళ్లే పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు ఎక్కినట్లు సీసీ పుటేజీల్లో గుర్తించారు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేదల ఆరోగ్యానికి సీఎం జగనన్న భరోసా..

88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 త్యాళ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 720 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సిరిచందన, డాక్టర్ ఎస్.రమాదేవీ, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ విశ్వనాథ్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డీడీవో డాక్టర్ రమాదేవీ మాట్లాడుతూ రోగుల వ్యక్తిగత ప్రొఫైల్ నమోదు చేసి, ఎప్పుడు ఏ ఆరోగ్య సమస్యలు తలెత్తిన సరైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు. కంటి సమస్యలున్న వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.మహేష్, ఈవోపీఆర్డీ పి.శివరామయ్య, ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్, ఆరోగ్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తోట అప్పారావు, వెంకట్రావు, నన్నూబాషా పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం

సత్తెనపల్లి: ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అబ్బూరు గ్రామ సర్పంచ్ గొలదారి అన్నపూర్ణమ్మ అన్నారు. సోమవారం అబ్బూరు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ యు.శ్రీలక్ష్మి కవిత, డాక్టర్ సాయి తేజరెడ్డి, చర్మ వైద్య నిపుణులు డాక్టర్ అఖిల, జనరల్ సర్జన్ డాక్టర్ సాదియా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కంటి పరీక్షలు నిర్వహించి, అవసర మైనవారికి కళ్లజోళ్లు ఉచితంగా అందించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి, ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో న్యూట్రీషన్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు యార్లగడ్డ అలేఖ్య, కృపారావు, ఎంపీడీవో జి.వి. సత్యనారాయణ, తహసీల్దారు ఎస్.సురేష్, ఆరోగ్య విస్తరణ అధికారి పి.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బలిజేపల్లిలో 347 మందికి వైద్య పరీక్షలు

రాజుపాలెం: బలిజేపల్లి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం జరిగింది. ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు శిబిరాన్ని పరిశీలించారు. వైద్యులు డాక్టర్ సుష్మ, డాక్టర్ లక్ష్మణరావు, ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ కిషోర్, డాక్టర రవితేజనాయక్ 347 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. 200 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 11 మంది గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి సలహాలు సూచనలు ఇచ్చారు. 140 మందికి కంటి పరీక్షలు చేశారు. వారికి త్వరలో కళ్లజోళ్లు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉషారాణి, సర్పంచ్ గౌతుకట్ల జ్యోతి, గ్రామ సచివాలయం సిబ్బంది, ఆశ, అంగన్వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓర్వకల్లులో..

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. వైద్యులు 347 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 11మంది చిన్నారులు, 120మందికి కంటి పరీక్షలు నిర్వహించి 85 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. 18 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ వైద్యశాలలకు రిఫర్ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ఇన్నారావు, డాక్టర్ రాంబాబు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ రాజేష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొలకలూరి పేరయ్య, మాజీ సర్పంచ్ పూల కిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు పూల వెంకటేశ్వర్లు, అంబటి నారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మల్లాదిలో..

అమరావతి: మండల పరిధిలోని మల్లాది సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ఎంపీపీ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ వైద్యాధికారులు రవిబాబు, మౌనిక, కల్యాణి, గీతా కల్యాణ్ 418 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీనాయకుడు వెంపా వాసు తదితరులు పాల్గొన్నారు.

చేజర్లలో..

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ వి.శ్రీనునాయక్, డాక్టర్ పూజశ్రీ, గైనకాలజిస్టులు డాక్టర్ పువ్వాడ సాయిలక్ష్మి, డాక్టర్ సుమిత్ర, సీహెచ్ఓ వెంకటరెడ్డి 419 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ గిరిధర్, ఎ.వెంకటరెడ్డి, భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

ఇరుకుపాలెంలో ..

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం జరిగింది. శిబిరంలో వైద్యులు వి.జయకృష్ణ, వి.శ్రీనివాస్, జె.శ్రీనివాసరావు, సీహెచ్‌ప్రసన్నకుమార్ 120 మందికి వైద్య సేవలందించారు. కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్ ను ఏర్పాటు చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌లను పంపిణీ చేశారు. చిన్నారులకు ప్రీప్రైమరీ కిట్‌లను అందించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.భవానిశంకర్, సీహెచ్ఓ ఆంజనేయులు, రామకృష్ణ పాల్గొన్నారు.



బలిజేపల్లి శిబిరంలో రక్త పరీక్షలు చేయించుకుంటున్న రోగులు



ఓర్వకల్లులో కళ్లజోళ్లు పంపిణీ



అబ్బూరులో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీకవిత



మల్లాదిలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు



చేజర్ల వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

కాన్షిరామ్‌కు ఘన నివాళి

సత్తెనపల్లి: పట్టణంలోని పాత బస్టాండు సెంటరులో బీసీ సంఘాలు కాన్షిరాం 17వ వర్ధంతిని సోమవారం నిర్వహించాయి. కాన్షిరాం చిత్ర పటానికి పులమాల వేసి, నివాళులర్పించారు. బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, రామస్వామి నాయకర్, ఛత్రపతి, అంబేడ్కర్ ప్రబోధాలను రాజ్యాధికారం వైపు నడిపించిన గొప్ప నాయకుడు కాన్షిరాం అని పేర్కొన్నారు. కులాన్ని నిర్మూలిద్దాం-బహుజన సమాజాన్ని నిర్మిద్దాం అంటూ దేశవ్యాప్తంగా ఉద్యమం చేసిన మహోన్నత నాయకుడు అని గుర్తుచేశారు. ఈ గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, బూర్సు శ్రీనివాసరావు, పెరుబోయిన ప్రకాష్, ఆళ్ల కనకయ్య, జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాన్షిరాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రొంపిచర్ల ఇన్‌చార్జి ఎస్ఐ హజరత్తయ్య సోమవారం తెలిపారు. గత నెల 25వ తేదీ అర్ధరాత్రి నరసరావుపేట వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ మున్నా (24) ఈపూరులో నిర్వహించిన వివాహ ఈవెంట్ ముగించుకుని అతని స్నేహితురాలైన అశ్వినితో ద్విచక్ర వాహనంపై నరసరావుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో రొంపిచర్ల మండలం తుంగపాడు గ్రామ సమీపం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి మైలు రాయిని ఢీకొంది. సంఘటనలో అశ్విని అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ మున్నాను నరసరావుపేట పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. శవపంచనామ అనంతం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నరసరావుపేటలో....

నరసరావుపేట టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు సోమవారం తెలిపారు. ఇస్లాంపేటకు చెందిన షేక్ ఖాలేషావలి (27) వంటపనులు చేస్తూ ఉంటాడు. అవసరం కోసం వరవకట్టకు చెందిన వడ్డీ వ్యాపారి వద్ద రూ.5,000 అప్పుగా తీసుకున్నాడు. నగదు తిరిగి చెల్లించక పోవటంతో వడ్డీ వ్యాపారి ఇంటి వద్దకు వెళ్లి గొడవ చేశాడు. దీంతోపాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఖాలేషావలి ఈ నెల 4వ తేదీన క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని 108 సహాయంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయానికి చేరిన కలశాలు



రాజుపాలెం: నా భూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి నవ ధాన్యాలు, మట్టితో కూడిన పూర్ణ కలశాలను కార్యదర్శులు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి తీసుకొచ్చారు. ఎంపీడీవో టి.శ్రీనివాసరావు పూర్ణ కలశాలను 17 పంచాయతీల కార్యదర్శుల నుంచి సేకరించారు. వీటిని ముగ్గురు గల కమిటీ ద్వారా ఢిల్లీ పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునశర్మ, ఈవోపీఆర్డీ పగడాల ముక్కంటి, సూపర్‌నెంట్ ఎస్.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్కూల్లో అసాంఘిక కార్యకలాపాలపై ఫిర్యాదు

మాచవరం: మండలంలోని తురకపాలెం యూపీ స్కూల్‌లో కొందరు వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలు చేపడుతూ పేకాట, మద్యం తాగడం వంటి వాటికి పాల్పడుతున్నారని హెచ్ఎం విజయలక్ష్మి, గ్రామ సర్పంచ్ షేక్ అల్లాభక్షు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల స్కూల్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలు, విద్యుత్ బోర్డులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని, విచారించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రారంభమైన జాతీయ తపాలా వారోత్సవాలు

నరసరావుపేట టౌన్: ప్రపంచ తపాలా దినోత్సవాన్ని పురస్కరించుకుని తపాల శాఖ ఆధ్వర్యంలో తపాల సేవలు ప్రజలకు మరింత చేరువ చేస్తూ 9 నుంచి 13వ తేదీ వరకు జాతీయ తపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ పి. వెంకటస్వామి సోమవారం తెలిపారు. మొదటి రోజు వరల్డ్ పోస్ట్ డే, రెండవ రోజు సేవింగ్స్ బీమా, మూడవ రోజు వివిధ రకాల స్టాంప్‌ల సేకరణ, నాల్గవ రోజు మెయిల్స్ పార్సిల్స్ డే, ఐదవ రోజు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేషన్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు సేవలు, డీబీటీ ద్వారా పోస్టాఫీస్ ద్వారా చెల్లింపులపై అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు.

చేగువేరా వర్ధంతి

పిడుగురాళ్ల: పట్టణంలోని ప్రజాశక్తినగర్‌లో ఉన్న కన్నెగంటి హనుమంత్ భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో క్యూబా పోరాట యోధుడు కామ్రేడ్ చేగువేరా 56వ వర్ధంతి నిర్వహించారు. ముందుగా చేగువేరా చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూబా విముక్తి కోసం, దక్షిణాది దేశాల విముక్తి కోసం సైకిల్, మోటార్ సైకిల్‌పై పర్యటిస్తూ ఆయా దేశాల ప్రజల సమస్యలు తెలుసుకొని వారిని చైతన్య పరిచారని, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా చివరి వరకు పోరాడిన యోధుడు చేగువేరా అని అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, జె.కృష్ణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి రోల్‌ప్లే, ఫోక్‌డాన్స్ పోటీలు

యడ్లపాడు: జిల్లాస్థాయి రోల్‌ప్లే, ఫోక్‌డాన్స్ పోటీలను ఈనెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎం సుభాని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్ హైస్కూల్స్‌లో 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొనవచ్చన్నారు. బోయపాలెం జిల్లా విద్యాశిక్షణ కేంద్రంలో బుధవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. మరిన్ని వివరాలకు డైట్ లెక్చరర్ 97047 90917లో సంప్రదించాలని కోరారు.

బీఎస్సీ, బీకాం స్పాట్ అడ్మిషన్లు

వినుకొండ టౌన్: బీఎస్సీ, బీకాంలలో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 13 వరకు స్వీకరిస్తున్నట్లు రాధా డిగ్రీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కె.వి.రాధాకృష్ణమూర్తి సోమవారం తెలియచేశారు. చేరబోయే విద్యార్థులు 13వ తారీకు సాయంత్రం 5 గంటలలోపు పట్టణంలోని సిద్ధార్థ నగర్, హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ వద్ద గల రాధా డిగ్రీ కళాశాలలో తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 9059098426, 9701286012, 9440163917 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

ముప్పాళ్ల(సెత్తెనపల్లి): మహిళలు, బాలికా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్ అన్నారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చట్టాలపై అవగాహన కల్పించి, కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక మహిళా మండలి సమైక్య భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముప్పాళ్ల మండల డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. మహిళలు, బాలికల కోసం ఎన్నో చట్టాలున్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాలకు స్వస్తి చెప్పి, తమ పిల్లలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని కోరారు. వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు బాలస్వామి మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ కొరకు ఎన్ని కఠిన చట్టాలు చేసినప్పటికీ పసి పిల్లల మొదలు మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులు నిత్యం జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తపరిచారు. ఇలాంటి క్రమంలో చట్టాలు, హక్కులు ద్వారా రక్షణ పొంది మనోధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, రాములమ్మ, సీసీలు నాగరాజు, మల్లేశ్వరరావు, యాక్టివిస్టు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీప్రసాద్

మహిళపై దాడిని అడ్డుకున్నందుకే నిందలు

- న్యాయవాదిపై దురుసు ప్రవర్తన ఆరోపణ అవాస్తవం
- సీఐ వీరాస్వామి వివరణ

అచ్చంపేట: పోలీస్ సిబ్బంది ఎదుటే మహిళపై దాడి చేసిన న్యాయవాదిని నివారించినందుకే తమపై నిందులు వేస్తున్నారని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వీరాస్వామి వివరణనిచ్చారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత నెల 20న వేల్పూరుకు చెందిన తాళ్లూరి ఆశాజ్యోతి అనే మహిళ వ్యక్తిగత కారణాలతో షుగర్ మాత్రలు ఎక్కువగా మింగి అచ్చంపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చిందన్నారు. ఆమెకు వరసకు అన్న అయిన కోట సాంబశివరావు అనే వ్యక్తి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఆశాజ్యోతిపై దాడిచేయబోగా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ వై.సురేష్, స్టేషన్ రైటర్ సత్యంరాజు అడ్డుకున్నారని చెప్పారు. ఎదైనా సమస్య ఉంటే ఎస్ఐ మణికృష్ణతో చెప్పుకోమనడంతో.. తాను నేను లాయర్‌ని అని.. ఈమె తన చెల్లెలు అని, తన ఇష్టమొచ్చినట్లు కొట్టుకుంటానని వాదనకు దిగినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఎస్ఐ వచ్చి స్టేషన్‌లో గొడవలు పనికిరావని, సమస్యలుంటే ఫిర్యాదు చేసుకోవాలని చెప్పడంతో.. సాంబ శివరావు అక్కడి నుంచి వెళ్లపోయినట్లు పేర్కొన్నారు. అంతేగాని సదరు సాంబశివరావుపై దురుసుగా ప్రవర్తించడం గాని, అమర్యాదగా మాట్లాడంగాని జరగలేదన్నారు. తనపై అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ దురుసుగా, అమర్యాదగా ప్రవర్తించాడంటూ సత్తెనపల్లిలో న్యాయవాదులతో కలిసి ధర్నాలు చేయడం, సోషల్ మీడియాలో అసత్య పోస్టింగ్‌లు పెట్టడం అమానుషమన్నారు. న్యాయవాదులు, పోలీసులు సమాజ హితం కోసం పనిచేయాలే తప్ప ప్రజలకు తప్పుడు సంకేతాలు ఇచ్చే విధంగా ఉండకూడదన్నారు. ఆయన వెంట అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ, క్రోసూరు ఎస్ఐ కె.పాల్‌ఆనంద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ కె.వీరాస్వామి

పౌష్టికాహార నాణ్యతపై ఆరోపణలు అవాస్తవం

అమరావతి: మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలింతలకు, పిల్లలకు సరఫరా చేసే పౌష్టికాహార నాణ్యతపై వచ్చిన అరోపణలు అవాస్తవమని క్రోసూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అసిస్టెంట్ సీడీపీఓ సరళ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమరావతి, ధరణికోట సెక్టారులలో అంగన్వాడీ కార్యకర్తలను, లబ్ధిదారులను ఆమె విచారణ చేశారు. ఓ దిన పత్రికలో వచ్చిన వార్త కథనంపై తాము జరిపిన విచారణలో పౌష్టికాహార పంపిణీలో ఎలాంటి నాణ్యత లోపాలు లేవని వెల్లడించారు. లబ్ధిదారుల నుంచి కూడా ఎటువంటి ఫిర్యాదు రాలేదని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతీదేవి ఉన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ సీడీపీఓ సరళ

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

కారెంపూడి: శృతిమించిన ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణం ఇబ్బందుల్లో పడిందని వాతావరణంతో పాటు నీటి కాలుష్యం పెరిగి జీవ మనుగడకు ముప్పు వాటిల్లుతోందని పర్యావరణ పరిరక్షణకు అందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపి వేయాలని కారెంపూడికి చెందిన పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న కొమెర అంకారావు (జాజి) కోరారు. ప్లాస్టిక్ వల్ల అనర్థాలను దాని వల్ల పర్యావరణానికి జరుగుతున్న ముప్పును వివరిస్తూ జాజి రూపొందించిన కర పత్రాన్ని ఎస్ఐ ఎం.రామాంజనేయులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజి ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల గ్రామాలలో చెరువులు నీటి కుంటలు కలుషితం అవుతున్నాయని, నీటి కాలుష్యం వల్ల చిన్న ప్రాణులు చనిపోతున్నాయని గ్రామాలలో పారిశుధ్య సమస్యలు పెరిగాయని ప్రతి ఒక్కరూ దీన్ని బాధ్యతగా తీసుకుని ముందుగా ఒక సారి వాడి బయట పడేసే అన్ని రకాల ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శ్రీ చక్ర సిమెంట్స్ పీఆర్ఓ మురళీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎస్ఐ రామాంజనేయులు, పర్యావరణ ప్రేమికుడు జాజి

ఎంత సాగు చేస్తున్నారు?

- అంతర్ పంటలు ఏమి వేశారు?
- సాతులూరులో రైతులతో మాట్లాడిన కలెక్టర్ శివశంకర్
- పత్తి, మిర్చి సాగు పరిస్థితులపై ఆరా

నాదెండ్ల: ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా సాగవుతున్న పంటలను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ సోమవారం పరిశీలించారు. సాతులూరు గ్రామంలోని పత్తి, మిర్చి పంటలు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ప్రస్తుత పంట పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామానికి చెందిన రైతు గడ్డం శివాజి పత్తి, కంది అంతర్ పంటను 3:1 నిష్పత్తిలో సాగు చేస్తున్న అంతర్ పంటలు పరిశీలించి, సాగు విధానం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మంగళవారం లోగా జిల్లా వ్యాప్తంగా ఈక్రాప్ నమోదును పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రతిరోజూ మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ సచివాలయాల్లో ఈకేవైసి చేయించుకోవాలన్నారు. ఈ ఏడాది వర్షాలు తక్కువగా ఉన్నందున పత్తి సాగు గణనీయంగా తగ్గిందని, ఈ మేరకు మిర్చి సాగు పెరిగిందని, స్థానిక వ్యవసాయాధికారి ఎ హరిప్రసాద్ వివరించారు. ప్రస్తుతం పత్తిలో అక్కడక్కడ గులాబీరంగు పురుగు ఆనవాళ్లు కనిపిస్తున్నాయని, పత్తి రైతు ఎకరాకు 10 తగ్గకుండా లింగకార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు మస్తానమ్మ, శివకుమారి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు వేణుగోపాల్, రామారావు, కోటంరాజు ఉన్నారు.



సాతులూరులో పత్తి పంట సాగు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్